# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్ లోని చీనాబ్, అంజీఖాద్ వంతెనలను ఈరోజు ప్రారంభించారు.
- స్థానిక భాషలను బలోపేతం చేయడం ద్వారా భారత్ శాశ్వతమైన వైభవాన్ని పొందుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ వైఖరికి జర్మనీ పూర్తి మద్దతు ప్రకటించింది.
- దేశంలో క్రియాశీలక కోవిడ్ కేసుల సంఖ్య 5 వేల 364కు చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

=============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమ్ము కశ్మీర్ లోని చీనాబ్, అంజీఖాద్ వంతెనలను ఈరోజు ప్రారంభించారు. చీనాబ్ వంతెన ప్రపంచంలో అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన కావడం విశేషం. అలాగే.. అంజీ ఖద్ వంతెన భారతదేశంలో మొట్ట మొదటి కేబుల్ - స్టెయిడ్ రైలు వంతెన. ఇవి ఉధంపూర్ - శ్రీనగర్ – బారాముల్లా రైల్వే లింక్ (USBRL) లో భాగంగా నిర్మించబడ్డాయి. 272 కి.మీ. USBRL ప్రాజెక్టు సుమారు 44 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించడం జరిగింది. పూర్తిగా విద్యుదీకరించబడిన ఈ రైలుమార్గంలో 36 గుహలు, 943 వంతెనలు ఉన్నాయి. జమ్ము కశ్మీర్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి కాట్రా స్టేషన్‌ని సందర్శించి శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా - శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. కత్రాలో 46 వేల కోట్ల రూపాయల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. నూతన ప్రాజెక్టులు జమ్మూ కాశ్మీర్ నూతన శక్తిని ప్రతిబింబించేవిగా అభివర్ణిస్తూ..

(వాయిస్ బైట్...35 సెకన్లు)

=============================

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో భారతీయ భాషా అనుభాగ్‌ను ప్రారంభించారు. విదేశీ భాషల ప్రభావం నుండి పరిపాలనను విముక్తి చేసే దిశలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఆలోచన, విశ్లేషణ, నిర్ణయం తీసుకునే ప్రక్రియలు మాతృభాషలో ఉన్నప్పుడే సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్ని స్థానిక భాషలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే భారత్ తన శాశ్వతమైన వైభవాన్ని చేరుకుంటుందని అమిత్ షా పేర్కొన్నారు. దేశంలోని భాషా వైవిధ్యాన్ని కలుపుకొని భారతీయ భాషా అనుభాగ్ అన్ని భాషలకు బలమైన, వ్యవస్థీకృత వేదికను అందిస్తుందని వివరించారు.

=============================

భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు రవిశంకర్ నేతృత్వంలోని అఖిల పక్ష పార్లమెంటరీ కమిటీ ఈరోజు జర్మన్ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ నౌరిపోర్ తో చర్చలు జరిపింది. చర్చల్లో భాగంగా.. ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రవాద దాడి పట్ల భారత్ ప్రతిస్పందనను అఖిలపక్ష కమిటీ ప్రతినిధులు వారికి తెలియజేసి, ఆపరేషన్ సిందూర్

గురించి వివరించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా భారత్ జీరో టాలరెన్స్ వ్యవహరిస్తుందని పునరుద్ఘాటించారు. అనంతరం భారత ప్రతినిధి బృందం బుండెస్టాగ్ విదేశాంగ కమిటీ ఛైర్మన్ అర్మిన్ లాషెట్, రాల్ఫ్ బ్రింక్‌హాస్, హుబెర్టస్ హీల్‌తో సహా ఇతర సభ్యులను, మాజీ మంత్రులను కూడా కలిసింది. ఉగ్రవాదం పట్ల భారతదేశ వైఖరిని తెలియజేయడంతో పాటు అణ్వాయుధ బ్లాక్‌మెయిల్‌కు లొంగకూడదనే సంకల్పాన్ని కూడా వివరించింది. ఈ సందర్భంగా.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ సూత్రప్రాయ వైఖరికి జర్మనీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో క్రియాశీలక కోవిడ్ కేసుల సంఖ్య 5 వేల 364కు చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోవిడ్ వ్యాధితో ఇప్పటివరకు 55 మంది మరణించారని పేర్కొంది. గడచిన 24 గంటల్లో 498 కోవిడ్ కేసులు కొత్తగా నమోదయ్యాయని, కేరళకు చెందిన ఇద్దరు, పంజాబ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోయారని వివరించింది. కేరళలో అత్యధికంగా ఒక వెయ్యి 679 క్రియాశీలక కేసులు ఉండగా... తరువాతి స్థానాల్లో గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ఉన్నాయని ఆ శాఖ తెలియజేసింది. అత్యవసర వైద్య సదుపాయాలు, ఆక్సిజన్ సహా అవసరమైన వైద్య సామగ్రిని ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సులో పాల్గొనాలని ఆ దేశ ప్రధానమంత్రి మార్క్‌కార్నీ భారత్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి.. ఆయన స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. కాగా.. కెనడా ప్రధానమంత్రి కార్నీతో మాట్లాడడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని ప్రధానమంత్రి మోదీ ఓ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కెనడా ఎన్నికల్లో విజయం సాధించిన కార్నీను అభినందించానని ప్రధానమంత్రి తెలియజేశారు. భారత్, కెనడా శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశాలని, పరస్పరం ఆసక్తులను గౌరవించుకుంటూ పని చేస్తామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా.. ఇస్రో గగన్‌యాన్ మిషన్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 10వ తేదీన అమెరికా అంతరిక్ష సంస్థ NASA ఆక్సియం 4 మిషన్ కింద అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపనున్న బహుళజాతి వ్యోమగాములలో శుభాన్షు శుక్లా ఒకరు. రష్యాలోని యూరి గగారిన్ కాస్మోనాట్ శిక్షణా కేంద్రంలోను, ఆ తరువాత బెంగళూరులోని ఇస్రో ఆస్ట్రోనాట్ శిక్షణా కేంద్రంలో కఠినమైన శిక్షణ పొందిన శుభాన్షు శుక్లాపై ప్రత్యేకమైన ఆహారం, పోషకాహార ప్రయోగాలను నిర్వహించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే నెల 3వ తేదీన జమ్మూ కాశ్మీర్‌లో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రకు పూర్తి భద్రత కల్పించేందుకు భారతసైన్యం ఆపరేషన్ శివ పేరిట ఒక సమగ్ర భద్రతా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి సంవత్సరం 38 రోజుల పాటు జరిగే ఈ యాత్ర 3 వేల 888 మీటర్ల ఎత్తులో ఉన్న జమ్మూ కాశ్మీర్‌లోని పవిత్ర అమర్‌నాథ్ మందిరానికి వేలాది మంది భక్తులు ప్రయాణమవుతారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడితో సహా ఇటీవలి భద్రతా సవాళ్ల దృష్ట్యా, సైన్యం, కేంద్ర సాయుధ పోలీసు దళాలు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, శ్రీ అమర్‌నాథ్‌జీ పుణ్యక్షేత్ర బోర్డు సమన్వయంతో యాత్రికుల భద్రత దృష్ట్యా పటిష్టమైన చర్యలను ప్రారంభించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ పీజీ 2025 పరీక్షను ఈ సంవత్సరం ఆగస్టు 3వ తేదీన ఒకే షిఫ్ట్‌లో నిర్వహించుకునేందుకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ NBE కి సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. ఈ పరీక్షను తొలుత ఈనెల 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పరీక్షను నిర్వహించడానికి NBE రెండు నెలలకు పైగా సమయాన్ని కోరగా.. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం కారణాలను చూపాలని సూచించింది. అయితే ఆగస్టు 3వ తేదీన NEET - PG 2025 పరీక్షను నిర్వహించడానికి NBE చూపిన కారణాలు సముచితంగా కనిపిస్తున్నాయని, మరింత సమయం ఇవ్వబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయాలని, భద్రతా ఏర్పాట్లు చేయాలని పేర్కొంది.

==============================

ముంబయి దాడుల నిందితుడు తహవూర్ హుస్సేన్ రాణా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు వచ్చే నెల 9 వరకు పొడిగించింది. గతంలో మంజూరు చేసిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగిసిన తర్వాత, రాణాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరు పరచగా.. ప్రత్యేక న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. రాణా ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని అతని న్యాయవాది లేవనెత్తిన నేపధ్యంలో వచ్చే సోమవారం నాటికి నివేదికను దాఖలు చేయాలని పాటియాలా హౌస్ కోర్టు.. తీహార్ జైలు అధికారులను ఆదేశించింది. అంతకుముందు, నిందితుడి స్వరం, చేతివ్రాత నమూనాలను NIA కోర్టు సేకరించింది.

==============================

విశాఖపట్టణం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ దృక్పథాన్ని ముందుకు తీసుకువెళ్ళినందుకు గాను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్ గా సందీప్ మాథూర్‌ను నియమించిన నేపధ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు సామాజిక మాధ్యమం ద్వారా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విభాగం కార్యకలాపాలను సులభతరం, వేగవంతం చేయడానికి ఈ నియామకం దోహదపడుతుందని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

==============================

==============================